# విశాల హృదయం

శ్రీమతి రాజేశ్వరీపట్నాయక్‌గారు

"విశాలా త్వరగా వంట చేసి తయారుగా వుండాలి పాసెంజరు వేళకు స్టేషనకు వెళ్లాలి" అన్నాడు విశ్వాస్.

"స్టేషనుకు వెళ్తే, వంట తొందరెందుకూ?" ప్రశ్నార్ధకంగా చూస్తూ కాఫీ కప్పు చేతి కిచ్చింది భర్తకు.

"నా మిత్రుడు ప్రసాద్ సతీ సమేతంగా వస్తున్నానని టెలిగ్రామ్ పంపేడు వారి నాహ్వానించడానికి నీవు కూడా రావాలి"

"ఓహో సరే గంటలో నేను తెమిలి రెడీగా వుంటాను" అన్నది విశాల.

విశ్వాస్ శ్రీమంతుడు, వున్నత విద్యావంతుడైనా వుద్యోగవాంఛ లేక తన జీవితాన్ని దేశసేవకు వినియోగింప దలచిన త్యాగశీలుడు. అతని భార్య విశాల అన్ని విధముల అతనికి అనువైన అర్ధాంగి, ఆదర్శవతి, విద్యావతి. వారి గృహరాజ్యములో ఆమె స్వాతంత్ర్యకుమారి, అతడుస్వేచ్ఛా కుమారుడు. వారి అన్యోన్య దాంపత్యం ఆదర్శమయమైనది. ప్రసాద్, విశ్వాస్ మిత్రుడు, రివెన్యూ యినస్పెక్టరుగా బదిలీయై మిత్రుని అతిథిగా వచ్చి, ఇల్లు దొరకని కారణంగా వారింటిలోనే కొంత భాగాన్ని ఆక్రమించి కాపురము పెట్ట వలసి వచ్చింది.

ప్రసాద్ భార్య సుశీలకు, విశాలకు చక్కని స్నేహం కుదిరింది. కాని వ్యక్తిగతమైన స్వాతంత్ర్య ప్రభగలవిశాలకు తద్ వ్యతిరేకమై సంకుచిత కృతిమ ఛాయకులోనైన సుశీలకు జీవిత గమనంలో తీరనిభేదం.

విశ్వాస్ తరచు పల్లెలలో సంచరిస్తూ వారి కష్టసుఖాల్లో పాల్గొని చేతనైన సహాయంచేస్తూ రెండు మూడు రోజుల వరకూ ఇంటిసంగతే మరచేవాడు. విశ్వాస్ కార్యక్రమాల్లో తరిఫీదు పొందిన 'విశాల' తీరిక సమయాల్లో దగ్గరనున్న మాల గూడెములకు వెళ్లి వారికి శుభ్రత బోధపరచి పేదల ఆరోగ్య సౌభాగ్యములకు కృషిచేసి సహకార సానుభూతులను చూపి ప్రగతిని చూపిస్తుండే ప్రచారకురాలు.

అది సాయంకాలం, చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. మధ్యహాల్లో వాలుకుర్చీలో అర్ధశయనంగా వుండి ఏకాగ్రతతో ఏదో పేపరు చదువుతున్నది విశాల. ఆప్రఫుల్ల వదనంలో గంభీరమైన క్రోధ రేఖలు విజృంభించి, మధ్యలో నిశితమైన భావరేఖలు విచార పూరితంగా ఆమె లలాట భాగంలో పచారు చేస్తున్నాయి. టేబిలు క్లాత్‌పై రంగు రంగుల దారంతో లతలమర్చి మధ్య జరీపూలను కుట్టుతూ యెదురుగుండానే మరొక కుర్చీలో కూర్చున్న సుశీల మధ్య మధ్య తన మిత్రురాలి విద్యాలాలసత్వాన్ని పరికిస్తూన్నది. కొంతసేపటికి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "అక్కా ఈ రోజు పేపరు వార్త లేమిటమ్మా?" అని ప్రశ్నించింది. నైజామ్ హైదరాబాదులతో భావయుద్ధం చేస్తూన్న విశాల, ఈ ప్రశ్నతో నిజావస్థను తెలుసుకొని "మానవజాతి, వైరుధ్యాల్లో మండి పోతూందే మమ్మా! గూండాల రాక్షస కృత్యాల్లో స్త్రీ శిశువుల హాహా రవాల్లో దేశం కంపించి పోతున్నది. ఒక స్త్రీని పన్నెండుగురు హంతక పశువులు చెరచగా ఆ స్త్రీ ప్రాణాల్ని గోల్పోయింది అబ్బా! మరి చదువలేను. హృదయం ద్రవించుక పోతున్నది" పేపరు సుశీల కందిచ్చింది. అంతలో తటాలున వీధితలుపు తెరుచుకొని ప్రసాద్‌లోన ప్రవేశించాడు అతన్ని చూడగానే చెదరిన హృదయాలను సరిచేసు కొనకయే వాళ్ళిద్దరూ కుర్చీల్లో నుంచి లేచి యెవరి భాగాల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

ఆ వేళ ఆదివారం. విశ్వాస్ కుర్చీలో కూర్చొని పల్లెల విశేషాలు "విశాల"తో చెప్తున్నాడు. "విశూ" . అను ప్రసాద్ పిలుపువిని "యిలా రావోయ్ ప్రస్!" (మిత్రుడిని ముద్దుపేరుతో ప్రస్ అని పిలవడం అలవాటు) అన్నాడు విశ్వాస్. ప్రసాద్ వచ్చి చేరువనున్న మరొక కుర్చీలో ఆసీనుడైయ్యాడు. మిత్రులిద్దరికి కాఫీ సిద్ధపరిచింది విశాల.

"రాత్రనక పగలనక అలా తిరుగుతూంటావు, ఆరోగ్యం పాడవదూ? నీ ఒక్కనివలన బానిసత్వానికీ సోమరితనానికి

లోనైన ఈ దేశం వుద్ధరించ బడుతుందా?" అన్నాడు ప్రసాద్.

"ఆరోగ్య భంగమేమిటోయ్—లక్షలాది ప్రజలు అన్న వస్త్రాలకు కరువై మృత్యుదేవత కాహుతి అవుతూంటే నా బోటి ఒక ప్రాణికి ఆరోగ్య భంగమైతే ప్రమాదమేమబ్బా! 'మానవసేవయే మాధవసేవ.' ఇంటికొక పూవు ఈశ్వరుని కొకమాల అన్నట్టు విద్యావంతులు శ్రీమంతులు చేతులు కలిపి ఇంటికొకరు చొప్పున దేశ సౌభాగ్యానికి తోడ్పడిన దేశం యింత అధోగతికి లోనవుతుందా?" అన్నాడు విశ్వాస్.

మరుసటిరోజు తన కార్యక్రమము విశాలకు చెప్పి ఆమె చేయవలసినవి బోధించి, తెలిసిందా అన్నట్టు విశాల కేసి దృష్టి సారించాడు.

"నీవు పడుతున్న శ్రమచాలక ఆమెను కూడా యెందు కలా కష్టపెడ్తావు?" అన్నాడు ప్రసాద్.

కార్యక్రమాల ఆలోచనలో అన్య మనస్కుడైయున్న విశ్వాస్ జవాబు చెప్పలేదు. కాని ఒకమారు ప్రసాద్ ముఖాన్ని ప్రశ్నార్థంగా చూచి చిరునవ్వుతో వెళ్లి పోయింది విశాల. అప్పటికి గోడ గడియారం పదిగంటలు కొట్టింది. నిద్ర సమయమైనదని మిత్రులిద్దరూ లేచారు

* * *

"ఎందుకండీ అంత అనుమానం?" అన్నది సుశీల. "ఎన్నిసార్లు వాళ్ళ చర్చల్లో పాల్గొనద్దన్నా—నీకు బుద్ధి లేదు."

"అందులో తప్పేముందీ? వాళ్లిద్దరూ దేశ సేవకులు వాళ్ళచర్చల్లో మీరుమాత్రం పాల్గొనడం లేదూ?" అన్నది సుశీల.

"నాకూ—నీకూ భేదం లేదూ? పరాయి మగవాడి దగ్గర కూర్చునేందుకు చర్చించేందుకు నీకు సిగ్గులేదా? వాళ్లకు సిగ్గూ ఎగ్గూలేదు. సభల్లో ఉపన్యసించడం, వీధుల్లో తిర గడం, ఆమె భర్తకిష్టం ఆమె తిరుగుతోంది. నాకిష్టం లేదు. నీవామెతో తిరగడం, వప్పుకోను. పిచ్చి ముండాకొడుకు. అందుకనే వాడినలా ఆడిస్తోంది. పైగా అంత స్వతంత్రం పనికిరాదు ఆడదానికి. విశాల దుర్నడతదని వూళ్లో యెంత చెడ్డగా అనుకుంటున్నారో నీకు తెలుసా?" అన్నాడు ప్రసాద్.

"ఎవరా చెప్పుకున్నది? ఆమెను నిందించేవాళ్లు తెలివి తక్కువవాళ్లు వెధవలోకులు కాకులు. ఒకడేమంటే రెండో వాడూ అదేకూత. ఇది నిజమా కాదా అని విమర్శించే వాడే వొకడో—యిద్దరో— విశాల నిర్భయమైనది. స్వతంత్రురాలు, భర్తంటే అపరిమితమైన ప్రేమ. నాకది బాగా తెలుసు." అన్నది సుశీల.

"నీకెలా తెలుసు?" అన్నాడు ప్రసాద్.

"విశాల భర్త అందమైనవాడు, విద్యావంతుడు, రసికుడు కూడాను. అన్నీ సమకూడిన తరువాత, ప్రేమించాక విశాల మనసు అన్యథా పొమ్మన్నా పోదు. మీలాంటి వాళ్ళనుకుంటారు ఆయన భార్యకు స్వాతంత్ర్యం యిచ్చి బానిసై పోయాడని. కాని నిజంగా ఆలోచించితే ఆడదానికి నిర్బంధంలో పెట్టి అడుగడుక్కీ అనుమానించే భర్తమీద అసలే ప్రేమ వుండదు. ఇంతకీ దాంపత్యం అన్యోన్య ప్రేమతో కూడినది కావాలండీ" అన్నది సుశీల.

"నీకంత అందగాడై యున్నాడేమిటి విశ్వాస్, ఏమోతే!"

"ఛీ - ఛీ - చాలించండి మీ విపరీతపు మాటలు" అన్నది సుశీల.

"నేను ఆఫీసునుండి వచ్చాక మనింట్లో కాఫీ తీసుకున్న వేళకు వాళ్లేది చేసుకున్నా నీచేత నాకు పంపుతూంటుందే. యిటువంటివి అనుమానానికి తావీయవా?" అన్నాడు ప్రసాద్.

"చాల్లెండి. మిమ్మలను చూచి విరహం భరించలేకపోతున్నది కాబోలు. ఇటువంటి నీచభావాలు యిక మీద రానీయకండి. పదిదాటింది నాకు నిద్ర వస్తోంది" అన్నది సుశీల.

* * *

# విశాల హృదయం

రాత్రి పన్నెండు గంటలై యుంటుందేమో, చల్లని పండువెన్నెల ప్రపంచాన్నంతా ముంచివేసింది. విశాల పడకగదివైపు మల్లెపందిర ఆనుకనబడకుండ విరియ పూచింది.



"క్షమించు సోదరీ!" అన్నాడు గాద్గదిక కంఠంతో

రెండు రోజులై విశ్వాస్‌రాకకు యెదురు చూస్తూన్న విశాల ఈ రోజుకూడా నిరీక్షిస్తోంది. గదినుండి బయటికివచ్చింది. తెప్పవలె తేలిపోతున్న మల్లెపందిరజేరి కొన్ని పూలను కోసి జడలో తురుముకొంది. కొన్ని చేత్తోపట్టుకొని ఆఘ్రాణిస్తోంది. హటాత్తుగా ఆమెను రెండుచేతులు చుట్టి వేశాయి. విశాల విభ్రాంతయై గిఱ్ఱున వెనక్కి తిరిగి చకితురాలైంది.

. ప్రసాద్ . సుశీల భర్త కాస్సేపు మాట వచ్చింది కాదు. ఆమె నిలువెల్ల కంపించి పోతోంది. ముఖంకోపంతో యెఱ్ఱ బారింది. కన్నుల్లో మంటలు లేచాయి. చేతులు విసరి చెళ్లున ఒక్కచెంపకాయ తీసింది. కెవ్వున కేకవేసింది. ప్రసాద్ నిర్ఘాంతపోయాడు. విశాల కేకకు సుశీల నిద్రలో వులికిపడి కంగారుతో తలుపు తీసుకొని ఈవలకు వచ్చింది. వణకిపోతున్న విశాలను, కొయ్యయై నిలుచున్న భర్తనుచూచి సంగతి త్వరలో గ్రహించింది. ఇంతట్లో ప్రసాద్ విశాల కాళ్లపైబడి "క్షమించు సోదరీ!" అన్నాడు గాద్గదిక కంఠంతో—విశాల చూపులు వెఱ్ఱెత్తి పోతున్నాయి. జరిగినఘట్టం నమ్మదగినదేనా? సుశీలను చూడగానే ఆమె కన్నులశ్రుపూరితాలైనవి.

"అక్కా, వారిని క్షమించు." భర్తతో పాటు సుశీల ఆమె పాదాలమీద వ్రాలింది. చెరొకచేత్తో యిద్దరినీ లేవనెత్తి మలినభావానికి పశ్చాత్తప్తుడైన ప్రసాద్‌నుజూచి ఆనందాశ్రువులు రాల్చింది. పేరులోనున్న ఆదర్శం ఆమెహృదయ విశాలతను చాటింది. విశాల హృదయాన్ని కనుగొన్న ప్రసాద్ స్త్రీ సంఘాల సేవను సమర్థించుతూ సుశీలతో దేశసేవలో పురోగమనం సాగించాడు.